సాక్షి సిద్దిపేట

శనివారం । 22 । జూలై । 2023



నిబంధనలకు నీళ్లు

మున్సిపాలిటీలో యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులు లోపభూయిష్టంగా సాగడంతో ప్రస్తుత వర్షాలకు లోపాలు బయటపడుతున్నాయి. 8లో..



అధ్వానం.. వైకుంఠధామం

అక్కన్నపేట మండలం పెద్దతండాలో నిర్మించిన వైకుంఠధామం పనుల్లో లోపాలు కనిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రారంభానికి ముందే పగుళ్లు వచ్చాయి. 9లో..

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ సంపత్‌కుమార్ తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పట్టణ ప్రజలకు ఏఫైనా ఇబ్బంది ఎదురైతే 9505507248 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. 24 గంటలపాటు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

న్యూస్‌రీల్

వర్షాలకు పంటలు దెబ్బతినకుండా చూసుకోవాలి



రిమ్మనగూడలో జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

గజ్వేల్: అధిక వర్షాలకు పంటలు దెబ్బతినకుండా జాగ్రత్త తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో శుక్రవారం గజ్వేల్ మండలం రిమ్మనగూడ, బయ్యారం గ్రామాల్లో పత్తి, మొక్కజొన్న పంటలను స్థానిక వ్యవసాయాధికారి నాగరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా పత్తి, మొక్కజొన్న సాళ్ల మధ్య నీళ్లు నిలవకుండా చూసుకోవాలన్నారు. ఈ సమయంలో పత్తి మొక్కలు పసుపు రంగులోకి మారడమే కాకుండా ఆ తర్వాత ఎర్రబడతాయన్నారు. సమస్యను అధిగమించడానికి మొక్క వయసును బట్టి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 19–19–19 లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే మొక్కల ఎదుగుదలకు ఎకరాకు 25కిలోల యూరియా 10కిలోల పొటాష్ ఎరువులను మొక్కకు 5సెంటీమీటర్ల దూరంలో వేసుకోవాలన్నారు. మొక్కజొన్నలో అధిక తేమ వల్ల భాస్వరం లోపం ఏర్పడి మొక్కలన్నీ ఉదా రంగులోకి మారతాయన్నారు. దీని పరిష్కారానికి పొటాషియం నైట్రేట్ లేదా 19–19–19 లీటరు నీటికి 10 గ్రాములు కలిపి మొక్కలపై పిచికారి చేయాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత 25కిలోల యూరియా, 15నుంచి 20కిలోల పొటాష్‌ను కలిపి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు నర్సింలు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపుతున్న అధికారులు

ములుగు(గజ్వేల్): సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌కు చెందిన లెమెనిన్లీ ఫార్మ్‌ల మధ్య అధికారులు శుక్రవారం పరస్పర సహకార అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. విశ్వ విద్యాలయ వైస్ చాన్స్‌లర్ డా.బి.నీరజప్రభాకర్ ఆధ్వర్యంలో అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విదేశీ కూరగాయల పంటల సాగులో దిగుబడి, ఉత్పాదకతను పెంపొందించడం, విశ్వవిద్యాలయం నుంచి సాంకేతిక మార్గదర్శకత్వ ఇన్‌పుట్‌లను అందించడం, విద్యార్థులకు హార్టికల్చర్, ఇండస్ట్రియల్ కార్యక్రమం నిర్వహించడం కోసం లెమన్నిల్లీ ఫార్మ్‌తో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లేమన్నిల్లీ ఫార్మ్ డైరెక్టర్ జనార్దన్‌రావు, రితీష్ వెల్కూరు, భగవాన్, కిరణ్‌కుమార్, నటరాజన్ శ్రీనివాసన్, విజయ పాల్గొన్నారు.


జీతాలు పెంచాలి



నిరసన తెలుపుతున్న అద్దె బస్సు డ్రైవర్లు

సిద్దిపేటకమాన్: ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల వేతనాలు పెంచాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి, ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం సిద్దిపేట ఆర్టీసీ డిపో ఎదుట డ్రైవర్లు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీతాలు పెంచాలని రెండు నెలల కిందటే నోటీసులు అందజేశామని, అద్దె బస్సు యాజమాన్యాలు స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అదే విధంగా ఆర్టీసీ డిపో అధికారులు కూడా చొరవ చూపి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రవికుమార్, శ్రీనివాస్, లింగం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ సబ్జెక్టులలో బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఆంగ్లం–2, తెలుగు–2, సంస్కృతం–1, కంప్యూటర్ సైన్స్–2, గణితం–1, మైక్రోబయాలజీ–1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 25న ఉదయం 10:30గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

ఎవరికి వారే!

- జిల్లాలో నాయకుల హడావుడి
- సొంతంగా పర్యటనలు, కార్యక్రమాల నిర్వహణ
- టికెట్ తనకేనంటూ ప్రచారం
- ఎవరి వైపు ఉండాలనే సందిగ్ధంలో కార్యకర్తలు

బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లలో టికెట్ల కోసం తీవ్ర పోటీ

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో పాలిటిక్స్ హీటెక్కాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని పార్టీల నాయకులు హడావుడి చేస్తున్నారు. నియోజకవర్గాల్లో ఎవరికి వారే సొంతంగా సమావేశాలు, పర్యటనలు, పరామర్శలు లాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సారి ఎమ్మెల్యే బరిలో ఉంటానని, తనకే టికెట్ వస్తుందని, సర్వేలు నిర్వహించి టికెట్లు ఇవ్వాలని ప్రకటనలు చేస్తున్నారు. దీంతో ఆయా పార్టీల కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. ఎవరి వెంట తిరగాలి.. ఎవరికి సపోర్ట్ చేయాలని ఆందోళన చెందుతున్నారు. – సాక్షి, సిద్దిపేట

బీజేపీ నాయకుల దూకుడు

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు రానుండటంతో టికెట్ ఆశించే బీజేపీ నాయకులు దూకుడు పెంచారు. వివిధ కార్యక్రమాలు చేపడుతూ నియోజకవర్గాల్లో తిరుగుతున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, హౌజ్‌ఫెడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి ఇద్దరూ ఎవరికి వారే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇదే నియోజకవర్గానికి చెందిన సామాజిక సేవకురాలు త్వరలో బీజేపీలో చేరే అవకాశం ఉంది అదే జరిగితే హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ ఆశించేవారి సంఖ్య మూడుకు చేరనుంది. అంతేకాకుండా సిద్దిపేట నియోజకవర్గంలో కూడా బీజేపీ నేతలు ఎవరివారే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, నాయకుడు నరోత్తంరెడ్డి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతూ ఎమ్మెల్యే టికెట్ రేసులో మేమున్నామంటున్నారు.

బీఆర్ఎస్‌లో నాకంటే నాకే..

దుబ్బాక నియోజకవర్గంలో మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలకు దగ్గరవుతున్నారు. దివంగత మాజీ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి సతీమణి సుజాత, కుమారుడు సతీష్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. పార్టీ కార్యకర్తలు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబాలను పరామర్శిస్తు ఆర్థిక సాయం చేస్తున్నారు. ఇలా ఇద్దరు నేతలు నిత్యం ప్రజల్లో ఉంటున్నారు. త్వరలో రామలింగారెడ్డి కాంస్య విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా జనగామ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అధికారిక, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. అలాగే చేర్యాలలో ఇటీవల బీఆర్ఎస్ కార్యకర్తలతో ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు సమావేశం నిర్వహించారు. సర్వే రిపోర్టు ఆధారంగా టికెట్‌ను కేటాయించాలని సభ నుంచి కోరారు.

కాంగ్రెస్‌లో పోటీ ఎక్కువే..

కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కొన్ని రోజులుగా పాదయాత్ర నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజలు విన్నవించిన సమస్యలపై మండలాల వారీగా ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా సినీనటి, కాంగ్రెస్ నాయకురాలు కత్తి కార్తీక, టీపీసీసీ నాయకుడు శ్రవణ్ కుమార్‌రెడ్డి వర్గం వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎవరికివారు తనకే టికెట్ వస్తుందని కార్యకర్తలతో చెబుతున్నారు. కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య , మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిలు ఇద్దరు నేతలు ప్రజల మధ్య తిరుగుతున్నారు. సిద్దిపేటలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యవర్మ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దర్పిపల్లి చంద్రం, టీపీసీసీ కార్యదర్శి హరికృష్ణలు ఎవరి వారే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరు ఎవరికి వారే టికెట్ తమకే వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. ఎన్నికలు రాకముందే పరిస్థితి ఇలా ఉంటే ముస్ముందు ఎలా ఉంటుందోనని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

యుద్ధప్రాతిపదికన హరితహారం

9వ విడతపై అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సమీక్ష



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: తొమ్మిదవ విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా యుద్ధ ప్రాతిపదికన మొక్కలు నాటాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో హరితహారంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సంవత్సరం జిల్లాలో 2,010 ఎకరాల పండ్ల తోటల పెంపకం లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉన్న రైతులు మాత్రమే తోటల పెంపకానికి అర్హులని తెలిపారు. మామిడి, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, జామ, సపోట ఇలా కొన్ని రకాల తోటల పెంపకానికి ఉద్యానవన శాఖ అధికారులు రైతులను ప్రోత్సహించాలని సూచించారు.తొమ్మిదవ విడత హరితహారం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో సుమారు 21లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యాన్ని నిర్దేశించిందని, ఇప్పటివరకు 7.82లక్షల మొక్కలు మాత్రమే నాటారన్నారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున వేగవంతంగా మొక్కలు నాటాలన్నారు. స్థానిక అటవీ శాఖ నర్సరీ నుంచి మొక్కలను దిగుమతి చేసుకోవాలని తెలిపారు. గవర్నమెంట్ పాఠశాలలు, కళాశాలలు, భవనాలు, ఫ్యాక్టరీలు, రైస్ మిల్లుల వద్ద మొక్కలు నాటాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు 2023 భాగంగా సెంట్రల్ టీం పర్యవేక్షణకు ఎప్పుడైనా రావొచ్చని, పబ్లిక్ టాయిలెట్స్, ఇంకుడు గుంత, పారిశుద్ధ్యం ఇలా అన్నిటిపై దృష్టిసారించాలన్నారు. ఈ సమావేశంలో గజ్వేల్ ప్రత్యేక అధికారి ముత్యంరెడ్డి, డీఆర్డీఏ పీడీ చంద్రమోహన్ రెడ్డి, డీఎఫ్ఓ శ్రీనివాస్, జెడ్పీ సీఈవో రమేష్, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, డీఏఓ శివప్రసాద్, డీహెచ్ఓ సునీత, డీపీఓ దేవికి దేవి పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

సిద్దిపేటరూరల్: మహిళలు రుతుక్రమం సమయంలో నార్మల్ ప్యాడ్స్‌కు బదులుగా మెన్‌స్టువల్ కప్స్ వాడడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం తోపాటు, పర్యావరణాన్ని రక్షించినవారవుతారని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బుస్సాపూర్ గ్రామంలో డాక్టర్ శాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన రుతుప్రేమ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు డాక్టర్ శాంతి సూచనలు పాటించాలన్నారు. విలువైన కప్స్‌ను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. గ్రామంలో బయోగ్యాస్ ప్లాంట్, మహిళా బిల్డింగ్ వంటి అభివృద్ధి పనులు బాగున్నాయని అన్నారు. డీపీఓ దేవకీదేవి, ఏపీఎం విజయనిర్మల, సర్పంచ్ సదాశివారెడ్డి, ఎంపీడీఓ రాఘవేంద్రరెడ్డి, ఎంపీఓ హరిప్రసాద్, అంగన్‌వాడీలు, ఆశలు, సీసీలు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం



కుట్టు శిక్షణ పరికరాలు అందజేస్తున్న రోజాశర్మ

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దకోడూరు, చిన్నకోడూరు గ్రామాల్లో ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రంగనాయక సాగర్‌లో భూములు కోల్పోయిన కుటుంబాల మహిళలకు, వితంతులకు శిక్షణలో మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. 30 రోజులపాటు శిక్షణ ఇస్తారని, శిక్షణ సమయంలో భోజన వసతి కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్య రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సదానందం గౌడ్, సర్పంచ్‌లు కాముని ఉమేష్ చంద్ర, బట్టు లింగం, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ సోమిరెడ్డి, ఏపీఎం మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకలో బలగం టీమ్ సందడి



బలగం సినిమా టీంకు సన్మానం

దుబ్బాకటౌన్: పట్టణంలో శుక్రవారం బలగం సినిమా టీం సందడి చేసింది. వివేకానంద పిల్లల హాస్పిటల్‌ను డైరెక్టర్ వేణు ఎల్దండి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా సినిమాలో నటించిన బాలు కాయితి సిరిసిల్లను, రచయితలు రమేష్, నాగరాజులను డాక్టర్లు వంశీకృష్ణారెడ్డి, దిలీప్ కుమార్ సన్మానించారు. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడికి చేరుకొని సినిమా బృందంతో సెల్ఫీలు దిగారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, బీఆర్ఎస్ నాయకులు గన్నె భూంరెడ్డి, పులిగారి ఎల్లం, వడ్లకొండ శ్రీధర్, ఆసుపత్రి ఇంచార్జి షఫీ ఉన్నారు.

మహిళల భద్రత మా బాధ్యత

సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత



మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: బాలికలు, మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, వారి భద్రత బాధ్యత తమదేనని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినిలకు శుక్రవారం చట్టాలు, ఈవ్ టీజింగ్, పోక్సో, షీటీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్‌లపై సీపీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నర్సింగ్ కళాశాలలో చదువు పూర్తికాగానే ఉద్యోగాలు వస్తాయన్నారు. సోషల్ మీడియాలో గుర్తుతెలియని వారితో పరిచయాలు పెంచుకోవద్దని సూచించారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే డయల్ 100, షీటీమ్ వాట్సాప్ నెంబర్ 8712667343, మహిళా పోలీస్ స్టేషన్ నెంబర్ 8712667435లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళ పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

మహిళలకు అండగా భరోసా సెంటర్

పోక్సో, లైంగిక వేధింపులకు గురైన మహిళలు, బాధితులకు భరోసా, స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్లు అండగా ఉంటాయని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. పట్టణంలోని భరోసా సెంటర్‌లో మహిళలు, బాలికల రక్షణకు అందిస్తున్న సేవల గురించి శుక్రవారం సీపీ శ్వేత సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడైనా పోక్సో, అత్యాచార కేసులు జరగగానే సంబంధిత బాధితులకు భరోసా సెంటర్ ద్వారా చట్టప్రకారం సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, భరోసా సెంటర్ సిబ్బంది వినోద, సౌమ్య, హరిత, రేణుక, భవాని, స్వాతి, నవనీత, స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబులెన్స్ వచ్చేదెప్పుడో?

- ఇబ్బంది పడుతున్న అక్కన్నపేట మండల ప్రజలు
- పట్టించుకోని వైద్య శాఖ అధికారులు


అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రతి మండలానికి '108' సర్వీసును అందుబాటులోకి తీసుకొస్తే దాని పరిధిలోని గ్రామాలకు తక్కువ సమయంలో చేరుకోవడానికి వీలు కలుగుతుందని, ప్రాణాపాయం నుంచి అనేక మందిని రక్షించవచ్చనేది ప్రభుత్వ ఆలోచన. కానీ అక్కన్నపేట మండలం ఏర్పాటై ఏడేళ్లు అవుతున్నా 108అంబులెన్స్ కలగానే మారింది. ఈ పీహెచ్‌సీ పరిధిలో 17గ్రామాలు ఉన్నాయి. అందులో 20కిపైగా గిరిజన తండాలు, మారుమూల పల్లెలు ఉంటాయి. నిత్యం ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాలు, పాముకాటు, పురుగుల మందు తాగి ఆత్మహత్యలు ఇలా తదితర సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ సమయంలో అంబులెన్స్ అందుబాటులో లేక చాలామంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. అదేవిధంగా మండల కేంద్రంగా ఏర్పాటైనప్పటి నుంచి అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని వివిధ పార్టీ నాయకులు రోడ్డెక్కి ఆందోళనలు చేశారు. కానీ ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు అంబులెన్స్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు అంబులెన్స్ ఏర్పాటుపై దృష్టిసారించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రత్యేక దృష్టి సారించి వెంటనే అంబులెన్స్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అక్కన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు

పెద్ద మండలం అక్కన్నపేటలో పల్లెలు, గిరిజన తండాలు ఎక్కువగా ఉన్నాయి. రోజూ ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతాయి. 108అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడంలేదు. అంబులెన్స్ లేక గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి హరీశ్‌రావు తక్షణమే స్పందించి అంబులెన్స్ ఏర్పాటు చేయించాలి.



– కర్ణకంటి నరేష్, బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం: నర్సారెడ్డి



ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్ఎస్ ప్రభుత్వ మోసాలను ప్రతీ ఇంటికి తీసుకుపోతామని, గజ్వేల్‌లో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకొస్తామని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్ ఆత్మగౌరవ పాదయాత్రను రాయవరం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, అధికారంలోకి వస్తే చేపట్టబోయే పథకాల మేనిఫెస్టు కరపత్రాలను పంచుతూ ఇంటింటికీ తిరిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంతో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. అభివృద్ధి పేరిట అవినీతికి పాల్పడుతూ ప్రజావ్యతిరేక పాలన కొనసాగిస్తుందని ఆరోపించారు. ఉద్యోగాలు, పథకాలు అని చెప్పడం తప్ప ఇచ్చింది లేదని విమర్శించారు. పేదల నుంచి అసైన్డ్ భూములను లాక్కొని సర్కార్ రియల్ వ్యాపారం చేస్తుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, జగదేవ్‌పూర్, కుకునూర్‌పల్లి పార్టీ మండలాధ్యక్షులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు మల్లేశం, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

నేడు కవి సమ్మేళనం

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): మహాకవి దాశరథి జయంతి సందర్భంగా శనివారం సాయంత్రం 5గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలంగాణ రచయితల వేదిక (తెరవే) జిల్లా ప్రధాన కార్యదర్శి స్రవంతిమహిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రచయితల వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి తెరవే రాష్ట్ర అధ్యక్షులు కొండిమల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. 'దాశరథి–ఉద్యమసాహిత్యం' అనే అంశంపై ప్రముఖకవి పెర్కపెల్లి యాదగిరి, 'దాశరథి–సినిమా సాహిత్యం' అనే అంశంపై ప్రముఖ కవి వంగర నరసింహారెడ్డి ప్రసంగిస్తారని చెప్పారు. జిల్లాకు చెందిన కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అతలాకుతలం

- నంగునూరులో 4.6సెం.మీ వర్షపాతం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఐదు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి జిల్లా అతలాకుతలమైంది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి వాన తెరిపిచ్చింది. దీంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం నంగునూరు మండల కేంద్రంలో అధికంగా 4.6సెం.మీ. వర్షపాతం నమోదైంది. జోరువానలకు పంటల స్థితిగతులను వ్యవసాయాధికారులు పరిశీలించారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

జిల్లాలోని వాగులు పరిమితిని దాటి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. హల్దీ, కూడవెల్లి, మోయతుమ్మెద వాగులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. కోహెడ మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలోని మోయతుమ్మెద వాగు ప్రధాన రహదారిపై నుంచి ప్రవహిస్తుండటంతో సిద్దిపేట–వరంగల్ వైపు వెళ్లే వాహనాలను పోరెడ్డిపల్లి మీదుగా మళ్లించారు.

నిండు కుండలా..

ప్రస్తుత వర్షాలకు జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులు, చెక్‌డ్యాంలు నిండుకుండలా మారాయి. జిల్లాలో 2,271 చెరువులు ఉండగా 25శాతం వరకు నిండినవి 812 చెరువులు, 25శాతం నుంచి 50శాతం నిండినవి 543 చెరువులు, 50శాతం నుంచి 75శాతం వరకు నిండినవి 625 చెరువులు, 75శాతం నుండి 100శాతం వరకు నిండినవి 496 చెరువులు, 522 చెరువులు పూర్తిగా నిండి అలుగు పోస్తున్నాయి.



మత్తడి దుంకుతున్న చిన్నకోడూరు చెరువు

వర్షపాతం ఇలా..

గతేడాది జూన్ ఒకటి నుంచి జూలై 21 వరకు 22.39సెం.మీ వర్షపాతం నమోదవ్వగా, ఈ సంవత్సరం జూన్ ఒకటి నుంచి జూలై 21 వరకు 38.56సెం.మీ వర్షపాతం నమోదు అయ్యింది. గతంతో పోలిస్తే 16.17సెం.మీ వర్షపాతం అధికంగా నమోదు అయ్యింది.

క్లుప్తంగా

స్టార్టర్ బోర్డులో షార్ట్ సర్క్యూట్



షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు

నర్సాపూర్ రూరల్: షార్ట్ సర్క్యూట్‌తో మండలంలోని అవంచ ఎస్సీ కాలనీలో శుక్రవారం ఉదయం మంటలు చెలరేగాయి. ఎస్సీ కాలనీ వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సీ కాలనీలోని డప్పు రమేష్ ఇంటిని ఆనుకొని.. గ్రామానికి తాగునీటి సరఫరా చేసే బోర్‌కు సంబంధించిన మీటర్, స్టార్టర్ ప్యానల్ బోర్డు గ్రామపంచాయతీ సిబ్బంది ఏర్పాటు చేసింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఉదయం మీటర్ స్టార్టర్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో ఎస్సీ కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు విద్యుత్ శాఖ లైన్‌మెన్‌కు ఫోన్ చేసి చెప్పగా,సరఫరా నిలిపివేశారు.

ఉర్దూ మీడియం సమస్యలపై ఫిర్యాదు



మంత్రికి సమస్యలు వివరిస్తున్న అక్తర్ అహ్మద్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఉర్దూ మీడియానికి సంబంధించిన సమస్యలపై మంత్రి హరీశ్‌రావుకు ఫిర్యాదు చేసి వినతిపత్రం అందజేశామని ఎంఐఎం నియోజకవర్గం అధ్యక్షుడు అక్తర్ అహ్మద్ చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియోద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రిని హైదరాబాద్‌లో కలిశామన్నారు. ఉర్దూ మీడియం పాఠశాలలో టీచర్లు, జూనియర్, డిగ్రీ కళాశాలలో లెక్చరర్లను నియమించాలని కోరామన్నారు. జహీరాబాద్‌కు ఉర్దూ మీడియం డీఎడ్ కళాశాల, శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని విన్నవించినట్లు చెప్పారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జహీరాబాద్: పట్టణ శివారులోని ఓ వెంచర్ మధ్యలో ఉన్న వరదవాగుపై అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీతో కల్వర్టు, గోడలను తొలగించారు. వర్షం నీరు సవ్యంగా ముందుకు వెళ్లకపోవడంతో అధికారులు వెంచర్ మధ్యలో ఉన్న వాగుకు అడ్డంగా నిర్మించిన నిర్మాణాలు పూర్తిగా తొలగించారు.

గూడు చెదిరే..

ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు సామాన్యుడి గూడు చెదిరింది. రెక్కలు ముక్కలు చేసుకొని నిర్మించుకున్న పూరిళ్లు, పెంకుటిళ్లు వాన దెబ్బకు నేలకొరిగాయి. కళ్ల ముందే తమ ఇళ్లు కూలిపోతుండటం చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక లోలోన మదనపడుతున్నారు. కాగా, ముసురు ఎంతో ముప్పు తెచ్చిపెట్టిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నర్సాపూర్ రంగంపేటలో కూలిన ఇల్లు

సాక్షి, న్యూస్ నెట్‌వర్క్ : ఉమ్మడి జిల్లాలో కురుస్తున్న వర్షాల ధాటికి సిద్దిపేట కొమురవెల్లిలో మండలంలోని గురువన్నపేట, అయినాపూర్‌ల్లో 4 ఇళ్లు కూలిపోయాయి. మద్దూరు లద్నూర్‌లో భోగి సబితకు చెందిన ఇల్లు పాక్షికంగా కూలిపోయింది. దౌల్తాబాద్, రాయపోలు మండలాల్లో మహ్మద్ షాపూర్‌లో గోడలు తడిసి సంగనిస్వామి అనే వ్యక్తి పెంకుటిళ్లు కూలింది. వడ్డేపల్లిలో అయ్యగళ్ల లక్ష్మీ నర్సయ్యకు చెందిన గుడిసె, బేగంపేటకు చెందిన తిప్పని ఐలమ్మకు చెందిన పూరిల్లు ధ్వంసమైంది. వర్గల్‌లో తౌటి స్వరూప వెంకటేశం దంపతుల ఇల్లు అర్ధరాత్రి తర్వాత కుప్పకూలింది. మరో 5 ఇళ్లకు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వర్గల్‌లోనే మరొకటి, శేరిపల్లిలో ఒకటి, శాకారంలో 2, జబ్బాపూర్‌లో ఇల్లు పాక్షిక నష్టం వాటిల్లింది. గిర్మాపూర్‌లో జనావాస ప్రాంతంలో చెట్లు విరిగిపడ్డాయి. కాగా శివ్వంపేటలో 4, దొంతిలో 7, కొత్తపేటలో 2, లింగోజిగూడలో 2, సికింద్లాపూర్‌లో 2, తిమ్మాపూర్‌లో ఇల్లు పాక్షికంగా కూలింది. నవాబుపేట సాంబయ్య చెరువు నిండి అలుగు పారుతోంది. గురురాత్రి పిడుగుపాటుకు బాసంపల్లి నర్సింలు రైతుకు చెందిన లేగదూడ మృత్యువాత పడింది. పటాన్‌చెరు బొల్లారం మున్సిపల్ పరిధిలోని పలు పురాతన ఇళ్లు కూలాయి. జిన్నారంలోని పలు పెంకుటిళ్లు కుప్పకూలాయి.

అందోల్ మునిపల్లిలో మేళసంగ్యంలో 1, మునిపల్లిలో 3 ఇళ్లు కూలిపోయాయి. సంగారెడ్డి సదాశివపేటలో పట్టణంలోని 25వ వార్డులో డప్పూరి చంద్రశేఖర్ ఇల్లు కూలింది. రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ కుమారుడు చింతా సాయినాథ్ బాధితుడి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కొడిపల్లిలో 23 పూరిళ్లు పాక్షికంగా కూలినట్లు డిప్యూటీ తహసీల్దార్ తారాబాయ్, ఆర్ శ్రీహరి శుక్రవారం తెలిపారు. మనోహరాబాద్‌లోని పలు గ్రామాల్లో 9 పాక్షికంగా కూలాయి. కోనాయపల్లి(పీటీ)లో చిర్మని మహేశ్‌కు చెందిన ఇల్లు, చెట్లగౌరారంలో 2, జీడిపల్లి 3, పర్కిబండ 2, పోతారం ఒక ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. సదాశివపేట రూరల్లో మండల పరిధిలోని ముబారక్ పూర్(ఏ)కు చెందిన షరీఫొద్దీన్ ఇల్లు కూలింది. కొండపాకలో 5 ఇళ్లు కూలిపోయాయి. మర్పడ్గ, దుద్దెడ, జప్తినాచారం, మంగోల్‌ల్లోని చెరువులు అలుగు పారుతున్నాయి. కొల్చారం రంగంపేటలో కూలిన ఇల్లు కూలింది. చిన్నశంకరంపేటలోని ఖాజాపూర్‌లో 6 , మరిన్ని గ్రామాల్లో మరో 11 ఇళ్లు కూలాయి.



రాయపోలు: మహ్మద్‌షాపూర్‌లో..



వర్గల్‌లో ..



కొమురవెల్లి: అయినాపూర్‌లో..



జిన్నారంలో కూలిన పైకప్పు



కొండపాకలో



శివ్వంపేట మండలం సికింద్లాపూర్‌లో ..



లక్ష్మీప్రసన్నసాగర్ ప్రధాన రోడ్డుపై ఉబికి వస్తున్న మురుగు

నిబంధనలకు నీళ్లు

ఇళ్లల్లోని వర్షపు నీటి ప్రవాహం పారడానికి యూజీడీ కనెక్షన్ ఇవ్వకూడదు. కొన్ని ప్రాంతాల్లో అధికారులిచ్చారు. దీంతో మురుగునీరు ఉప్పొంగి, రహదారులపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. మరో వైపు భారీ వర్షాలకే యూజీడీ చాంబర్లు ఉప్పొంగడం కూడా లోపభూయిష్ట పనులకు తార్కాణంగా నిలుస్తోంది.

- యూజీడీ పనులు లోపభూయిష్టం
- వర్షమొస్తే చాంబర్ల నుంచి ఉబికొస్తున్న వైనం
- రోడ్లపైకి చేరుతోన్న మురుగు
- గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో.. ఇదీ దుస్థితి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులు లోపభూయిష్టంగా సాగడంతో లోపాలు బయటపడుతున్నాయి. తాజా భారీ వర్షాల నేపథ్యంలో యూజీడీ చాంబర్‌ల నుంచి మురుగు ఉబికి రోడ్లపైకి వస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. పట్టణంలోని లక్ష్మీప్రసన్ననగర్, సిరిఎన్‌క్లేవ్ తదితర కాలనీల్లో మురుగు ఉబికి బయటకొస్తుండడం, రహదారులపై దుర్గంధం వెదలజల్లుతుండడం అందుకు నిలువుటద్దం. సాధారణంగా యూజీడీ కనెక్షన్ వంటగదుల, టాయ్‌లెట్లు, స్నానపు గదుల మురుగు పారుదలకు మాత్రమే ఇవ్వాల్సి ఉంది. కానీ నిబంధనలకు పాతరేసి పలుచోట్ల ఇళ్లల్లో వర్షపు నీటికి ఇవ్వడంతో ఈ దుస్థితి నెలకొంది. మురుగు నివారణకు చేపట్టిన నిర్మాణం తిరిగి దానిని రోడ్లపై వదులుతున్నారు. దీంతో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. అంచనాలను ఇటీవల రూ.99 కోట్ల నుంచి 155 కోట్లకు అమాంతంగా పెంచారు. లోపాలు సరి చేసి, పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీనిపై కథనం.

నిధులిలా వచ్చాయి..

సీఎం కేసీఆర్ తన ఇలాకాలో.. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ఎస్‌డీఎఫ్(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) కింద రూ.99 కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌ల్లో 2020 జూన్‌లో 138 కిలోమీటర్ల మేర భూగర్భ మురుగు పైప్‌లైన్ వ్యవస్థతోపాటు 4 చోట్ల ఎస్‌టీపీ(సేవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ల నిర్మాణం పనులు ప్రారంభించారు. అందులో పైప్‌లైన్ల పనులు సాగుతుండగా, 4 ఎస్‌టీపీలు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. ఇక ఇళ్ల కనెక్షన్ల పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం 8,600 ఇళ్ల కు కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు 7 వేల పైగా ఇచ్చినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

అంచనా వ్యయం పెంపు

యూజీడీకి విడుదలైన రూ.99కోట్ల పనులతో పూర్తిగాక అధికారులు అంచనా పెంచారు. నిజానికి ముందున్న ప్రతిపాదనల్లో 138 కిలోమీటర్ల పైప్‌లైన్ విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంటే ప్రస్తుతం కేవలం 99 కిలోమీటర్ల వరకే పనులు పూర్తిచేశారు. కానీ పట్టణంలో ఇంకా పనుల్లో పైపులైన్లు నిర్మించాల్సిన కాలనీలున్నాయి. వీటి కోసం అదనపు నిధులు కోరామని అధికారులు చెబుతున్నారు. అదనంగా వచ్చిన రూ.56 కోట్లతో సుమారుగా 99 కిలోమీటర్ల నుంచి 130 కి.మీపైగా పైప్‌లైన్ పనులు పూర్తి చేశామని చెబుతున్నారు. పట్టణ అవసరాలను ముందుగానే అంచనా వేయడంలో అధికారులు విఫలం కావడంతో రెండోసారి అంచనాలు పెంచారని తెలుస్తోంది. పనులు సుమారుగా పూర్తి చేశామని అధికారులు చెబుతున్నా కోటమైసమ్మ రోడ్డు వైపు, పలు కాలనీల్లో ఇంకా పనులు కొనసాగుతున్నాయి.

లోపాలు సరిచేయిస్తాం

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని యూజీడీ పనుల్లో లోపాలు బయటపడుతున్న మాట వాస్తవమే. చాంబర్ల నుంచి మురుగు ఉబికి రావడానికి ఇళ్లల్లో వర్షపు నీటి కనెక్షన్లు ఇవ్వడమే కారణం. వీటిని పరిశీలించి తొలగిస్తాం. మురుగు ఇక నుంచి బయటకు రాకుండా చూస్తాం. ఇతర చిన్న, చిన్న లోపాలు సరిచేసి త్వరలోనే వంద శాతం పనులు పూర్తి చేస్తాం.

–వీర ప్రతాప్, ప్రజారోగ్యశాఖ ఈఈ

స్నేహితుడిని కలిసేందుకు వెళ్తూ..

- బైక్, లారీ ఢీకొని ఇద్దరి మృతి
- చేగుంట 44వ నంబర్ జాతీయ రహదారిపై ఘటన



బాలాజీసింగ్



రవితేజ

చేగుంట(తూప్రాన్): బైక్, లారీ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ సంఘటన చేగుంట శివారులోని మక్కరాజీపేట బైపాస్ బ్రిడ్జి సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామయంపేట మండలం జాన్సిలింగాపూర్‌కు చెందిన టాకూర్ బాలాజీసింగ్(32), కోళ్ల రవితేజ(20) బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. చిన్నశివునూర్ శివారు నుంచి వస్తున్న కంటైనర్, బైక్ మక్కరాజీపేట బైపాస్‌బ్రిడ్జి సమీపంలో 44వ నంబర్ రహదారిపై ఎదురెదురు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బాలాజీసింగ్, రవితేజలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలాజీసింగ్ కూలీ పనులు చేసుకునేవాడు కాగా, రవితేజ ఉపాధి హామీ పనులతోపాటు ఇతరేతర పనులు చేసుకునేవాడు. వీరిద్దరూ హైదరాబాద్‌లో ఉన్న స్నేహితుడిని కలిసేందుకు వెళుతుండగా రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందారు. వీరి మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు అదృశ్యం

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురు అదృశ్యమయ్యారు. నంగునూరులో ఇంటి నుంచి వెళ్లి ఒకరు, పటాన్‌చెరు పీఎస్‌పరిధిలో డ్యూటీకి వెళ్తున్నానని మరొకరు, ఝరాసంగం మండలంలో ఇద్దరు కూతుళ్లతో సహా తల్లి అదృశ్యమయ్యారు. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం..

పటాన్‌చెరు టౌన్ : డ్యూటీకి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పీఎస్ పరిధిలో ఆలస్యంగా బుధవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని గౌతమ్‌నగర్ కాలనీకి చెందిన అబ్రహం కూతురు(21) మదీనగూడలోని జీఎస్‌ఎం మాల్లో పనిచేసుకునేది. ఈనెల 17న డ్యూటీకి వెళుతున్నానని ఇంటి నుంచి వెళ్లి ఎంతకీరాలేదు. ఆమె కుటుంబ సభ్యులు పనిచేసే చోటుకు వెళ్లి విచారించగా డ్యూటీకి రాలేదని తెలిపారు. దీంతో కుటుంబీకులు.. తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. కూతురి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలతో సహా తల్లి ..

ఝరాసంగం(జహీరాబాద్): పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలపరిధిలోని జీర్లపల్లికి చెందిన మీనాక్షి తన కూతుర్లు నందిని, జహన్విలను తీసుకొని ఈనెల 20న మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. తెలిసిన వారిని, బంధువులను విచారించినా వారి ఆచూకీ తెలియరాలేదు. వెంటనే భర్త భర్త శివకుమార్ పోలీసులకు ఆశ్రయించారు. ఎస్సై రాజేందర్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అదృశ్యమైన తల్లీకూతుళ్లు

నంగునూరు(సిద్దిపేట): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన నంగునూరులో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన దేవులపల్లి చంద్రయ్య (55) వారం రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. బంధువులు, తెలిసిన వారిని విచారించినా ఆచూకీ తెలియరాలేదు. చంద్రయ్య భార్య దేవులపల్లి కనకవ్వ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చంద్రయ్య

ఉపాధ్యాయులు, ఉద్యోగులకు అన్యాయం

- ఐక్య ఉపాధ్యాయ పోరాట కమిటీ నాయకులు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నూతన పెన్షన్ విధానంతో ఉపాధ్యాయ, ఉద్యోగుల కుటుంబాలకు అన్యాయం జరుగుతోందని ఐక్య ఉపాధ్యాయ పోరాట కమిటీ నాయకులు న్నారు. జాయింట్ ఫోరమ్ ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీం (జేఎఫ్ఆర్ఓపీఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 23న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పాత పెన్షన్ సాధన సదస్సును విజయవంతం చేయాలని అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐక్య ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో పాత పెన్షన్ సాధన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూఎస్పీసీ రాష్ట్ర నాయకులు తిరుపతిరెడ్డి, తప్పెట్ల యాదగిరి, సీఎచ్. విజేందర్ రెడ్డి, టీ.రాజిరెడ్డి మాట్లాడుతూ 2004 నుంచి దేశవ్యాప్తంగా ఈ నూతన పెన్షన్ విధానం అమలవుతోందని, దీని ఫలితంగా ఉపాధ్యాయులు, ఉద్యోగుల్లో తీవ్రమైన అసంతృప్తి ఉందన్నారు. అందుకే దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దేవరాజ్, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ జిల్లా నాయకులు సమ్మయ్య, కృష్ణ, నరసింహారెడ్డి, మల్లయ్య, కనకరాజు, ఎం.పద్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : వర్షపు నీరు పోయే కాలువలో పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలోని మై హోమ్ సయుక్ సమీపాన గల కాలువలో ఓ వ్యక్తి మృతదేహాన్ని కూలీలు గుర్తించారు. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు కాలువలో పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బయటకు తీశారు. అతడి వయస్సు 40 ఏళ్లు ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు వారు కేసు దర్యాప్తు చేసున్నారు.

అందోల్–జోగిపేట మున్సిపాలిటీకి రూ.25కోట్లు

వట్‌పల్లి(అందోల్): అందోల్–జోగిపేట మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసినట్లు అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ తెలిపారు. అందోల్–మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. టీయూఎఫ్ఐడీసీ నిధుల కింద అందోల్–జోగిపేట అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.25 కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గతంలో సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయడంపై సీఎం కేసీఆర్‌కు, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

దత్తగిరి పీఠాధిపతులకు ఘనస్వాగతం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పీఠాధిపతులు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతులకు ఘనస్వాగతం పలికారు. అనసూయ మాత ఆధ్వర్యంలో చార్ధామ్ యాత్ర ముగించుకొని ఆశ్రమానికి వచ్చిన పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్‌కు, డాక్టర్ సిద్దేశ్వర స్వామికి స్వాగతం పలికారు. ఆశ్రమంలో యజ్ఞంతోపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. లోక కల్యాణార్థం దత్త హోమం దత్త యజ్ఞం, పూర్ణాహుతి, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. అదేవిధంగా జ్యోతిర్లింగాల వద్ద అభిషేకం మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో అర్చకుడు శివ శంకర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బన్సీలాల్‌కు అభినందనల వెల్లువ


బన్సీలాల్‌ను సన్మానిస్తున్న సర్పంచ్‌లు

గజ్వేల్‌రూరల్‌: గజ్వేల్ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన బన్సీలాల్‌కు గజ్వేల్ మండల సర్పంచ్‌లు అభినందనలు తెలిపారు. గజ్వేల్ ఆర్డీవోగా పనిచేసిన విజయేందర్‌రెడ్డి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో నూతనంగా వచ్చిన బన్సీలాల్‌ను శుక్రవారం అక్కారం సర్పంచ్ బాల్‌చంద్రం, బంగ్లావెంకటాపూర్ సర్పంచ్ బాబురెడ్డిలు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాండు, మన్నె అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడిగా పచ్చిమడ్ల స్వామి గౌడ్

కొమురవెల్లి(సిద్దిపేట): మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని రసులాబాద్ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామిగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం రాయపోల్‌లో జరిగిన సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు స్వామిగౌడ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించినందుకు గౌడ కులస్తుల సమస్యలు, హక్కులసాధనకు నిరంతరం పోరాటం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి, దౌల్తాబాద్, రాయపోల్, గజ్వేల్, సిద్దిపేట, చిన్నకోడూర్, చేర్యాల, కొండపాక గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఐ సంతోశ్

గజ్వేల్‌రూరల్‌: ఈవీఎంల ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే విధానంపై ఆర్‌ఐ సంతోశ్ అవగాహన కల్పించారు. మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రమేష్‌గౌడ్, అహ్మద్, నిజామొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

భల్లునాయక్ తండాలో రేషన్ షాపు ప్రారంభం


రేషన్ షాపును ప్రారంభిస్తున్న ఎంపీపీ మానస

హుస్నాబాద్‌రూరల్‌: భల్లునాయక్ తండాలో శుక్రవారం ఎంపీపీ లకావత మానస రేషన్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో పాటు అభివృద్ధికి నిధులు కేటాయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజినితిరుపతిరెడ్డి, సర్పంచ్ రజిత, ఉపసర్పంచ్ జవహర్‌లాల్, రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చేతన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సిద్దిపేటకమాన్‌: టీఎన్జీవోస్ మెడికల్ అండ్ హెల్త్ ఫోరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శ్రీధర్, సెక్రటరీ వెంకటేశ్వర్‌రావు, అసోసియేట్ అధ్యక్షులుగా లావణ్య, ఆంజనేయులు, ట్రెజరర్‌గా నాగజ్యోతిలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారిగా టీఎన్జీవోస్ సిద్దిపేట యూనిట్ అధ్యక్షుడు శశిధర్, గౌరవ అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, సెక్రటరీ విక్రమ్‌రెడ్డి, నిమ్మ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌నే గెలిపిద్దాం

గజ్వేల్‌రూరల్‌: గజ్వేల్‌లో కేసీఆర్‌నే మళ్లీ గెలిపిద్దామని, ఇతర పార్టీలకు స్థానం లేదని ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యంతో నేడు అన్ని రంగాల్లో గజ్వేల్ అగ్రగామిగా నిలిచిందన్నారు. అసాధ్యమనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే అగ్రగామిగా నిలిపారని పేర్కొన్నారు.

సీఐగా పదోన్నతి

సిద్దిపేటకమాన్‌: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న క్రిష్ణమూర్తి సీఐగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మల్లికార్జున్ వన్ కార్యాలయం హైదరాబాద్ నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువరించారు.

నాణ్యత డొల్ల.. ధామం ఇలా..!

పట్టించుకోని అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్‌): రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తుంటే సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో గుత్తేదారులు ఇష్టారాజ్యంగా పనులు చేస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. అక్కన్నపేట మండలం పెద్దతండాలో నిర్మించిన వైకుంఠ ధామం ప్రారంభం కాకముందే చేసిన పనుల్లో లోపాలు కనిపిస్తున్నాయి. మల్లంపల్లి, పెద్దతండా శివారులోని చెరువుకు ఆనుకొని నిర్మించిన వైకుంఠ ధామంలో అధికారుల పర్యవేక్షణ లోపంతో సదరు కాంట్రాక్టర్ పనులను ఇష్టారాజ్యంగా ముగించడంతో ప్రారంభానికి ముందే పగుళ్లు వచ్చాయి. అలాగే గ్రామంలో నిర్మిస్తున్న శ్మశానవాటిక నాణ్యత లోపంతో నిర్మించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువై గుత్తేదారు ఇష్టానుసారంగా నాసిరకంగా పనులు చేపట్టారని చెబుతున్నారు. నాసిరకమైన ఇసుక, మెటీరియల్ వాడటంవల్లే స్లాబ్‌కు పగుళ్లు వచ్చాయని అంటున్నారు. ఈ వైకుంఠధామానికి ఇప్పటికే సుమారుగా రూ.5లక్షల వరకు బిల్లులు చెల్లించినట్లు తెలిసింది.


పెద్దతండాలో నిర్మించిన వైకుంఠధామం..పగుళ్లు (వృత్తంలో)

కాగా మిగిలిన బిల్లుల కోసం సదరు కాంట్రాక్టర్ అధికారుల చుట్టు తిరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

వైకుంఠ ధామానికి పగుళ్లు వచ్చాయి

“పెద్దతండా గ్రామంలో నిర్మించిన వైకుంఠధామానికి పగుళ్లు వచ్చిన మాట వాస్తవమే. సుమారుగా రూ.5లక్షల వరకు బిల్లులు చెల్లించాం. చివరి బిల్లులు కూడా చెల్లించాలని కాంట్రాక్టర్ తిరుగుతున్నాడు. పగుళ్లు వచ్చిన చోట మరమ్మత్తు చేయిస్తాం. - స్నేహ, పంచాయతీరాజ్, ఏఈ

మొక్కలను సంరక్షించడం అందరి బాధ్యత

మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్‌: నాటిన మొక్కలను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. శుక్రవారం పట్టణంలోని 1వ వార్డు, నేతాజీనగర్ కాలనీలో మొక్కలు నాటారు. ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ ప్రకృతి పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలను నాటాలన్నారు. రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలను మేకలు, పశువులు తినకుండా వార్డు ప్రజలు కాపాడుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ కొంకట నళినిదేవి, కో ఆప్షన్ సభ్యుడు శంకర్ రెడ్డి, కొంకట రవి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు రవికుమార్, వార్డు ఆర్‌పీ సుమలత తదితరులు పాల్గొన్నారు.


నేతాజీనగర్‌లో మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత

మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

హుస్నాబాద్‌: భారీ వర్షాల నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎం.ఆర్ రాజశేఖర్ తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా శుక్రవారం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్షాలకు ఇండ్లు కూలిపోయినా, ఇండ్లల్లోకి వర్షపు నీరు చేరినా, రోడ్లు తెగినా, ఎలాంటి ఇబ్బందులు కలిగినా సహాయక చర్యల నిమిత్తం పట్టణ ప్రజలు కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి 1గంట వరకు జూనియర్ అసిస్టెంట్ జె. శంకర్, మధ్యాహ్నం 1గంట నుంచి రాత్రి 7వరకు జూనియర్ అసిస్టెంట్ శివ కుమార్, రాత్రి7నుంచి 8గంటల వరకు జూనియర్ అసిస్టెంట్ పున్న సృజన్ అందుబాటులో ఉంటారని తెలిపారు. హెల్ప్ లైన్ నంబర్ 7337347610కు సంప్రదించాలని కమిషనర్ రాజశేఖర్ తెలిపారు.



మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్

యాదవ మహాసభ అధ్యక్షుడిగా కనకరాజు

గజ్వేల్‌రూరల్‌: అఖిలభారత యాదవ మహాసభ గజ్వేల్ మండల అధ్యక్షుడిగా ఎక్కలదేవి కనకరాజు యాదవ్ నియామకమయ్యారు. శుక్రవారం గజ్వేల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో అఖిలభారత యాదవ మహాసభ ఆత్మీయ సమ్మేళనాన్ని సంఘం జిల్లా కార్యదర్శి రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యాదవ మహాసభ గజ్వేల్ అధ్యక్షుడిగా కనకరాజు యాదవ్‌తో పాటు యూత్ అధ్యక్షుడిగా లింగం యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వర్గల్ జెడ్పీటీసీ బాలుయాదవ్, గజ్వేల్ నియోజకవర్గ యాదవ మహాసభ ఇన్‌ఛార్జి సత్తిబాబుయాదవ్, ములుగు మండల అధ్యక్షుడు వెంకట్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, గిరియాదవ్, రఘుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ కమిటీతో మాకు సంబంధం లేదు..

15ఏళ్లుగా యాదవ సంఘాన్ని బలోపేతం చేస్తూ ముందుకు సాగుతున్న తమల్ని సంప్రదించకుండా ప్రకటించిన కమిటీతో సంబంధం లేదని గజ్వేల్ మండల అఖిలభారత యాదవ మహాసభ అధ్యక్షుడు కోనమైన కన్నాయాదవ్, సీనియర్ నాయకులు దామనమైన కొమురయ్యయాదవ్, అక్కరం రాజుయాదవ్, దేవులపల్లి మనోహర్‌యాదవ్‌లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీగిరిపల్లి కన్నాయాదవ్, వెంకటేష్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, రాజమల్లుయాదవ్, రాజయ్యయాదవ్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ మీసేవా సంఘం నూతన కార్యవర్గం

ఎన్నిక గజ్వేల్‌: గజ్వేల్ మీసేవా నిర్వాహకుల సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సంఘానికి గౌరవాధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి, అధ్యక్షుడిగా బిక్షపతి, ఉపాధ్యక్షుడిగా ఇసాక్, ప్రధాన కార్యదర్శిగా గాలెంక శ్రీనివాస్, కార్యదర్శిగా శివ, కోశాధికారిగా నాగరాజు, సలహాదారుగా సంపత్‌లను ఎన్నుకున్నారు. సభ్యులుగా కొత్త సంపత్, నవీన్, దీపారాణి, ప్రభాకర్, అప్సర్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గ ఎన్నిక అనంతరం మీసేవా సంఘం నాయకులు స్థానిక ఆ ర్డీవో బన్సీలాల్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

గజ్వేల్‌: గజ్వేల్ మీసేవా నిర్వాహకుల సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సంఘానికి గౌరవాధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి, అధ్యక్షుడిగా బిక్షపతి, ఉపాధ్యక్షుడిగా ఇసాక్, ప్రధాన కార్యదర్శిగా గాలెంక శ్రీనివాస్, కార్యదర్శిగా శివ, కోశాధికారిగా నాగరాజు, సలహాదారుగా సంపత్‌లను ఎన్నుకున్నారు. సభ్యులుగా కొత్త సంపత్, నవీన్, దీపారాణి, ప్రభాకర్, అప్సర్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గ ఎన్నిక అనంతరం మీసేవా సంఘం నాయకులు స్థానిక ఆర్డీవో బన్సీలాల్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వలయానందం!

మద్దూర్(హుస్నాబాద్‌): మూడురోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని గాగిల్లాపూర్ చెక్‌డ్యాం వద్ద మత్తడి పడుతుంది. మత్తడిలో ఎక్కువసంఖ్యలో చేపలు రావడంతో మత్స్యకారులు, యువకులు పెద్ద ఎత్తున పడుతున్నారు. గ్రామం నుంచే కాకుండా ఇతర గ్రామాల నుంచి చేపల వేటకు జనం వస్తుండడంతో చెక్‌డ్యాం వద్ద సందడి నెలకొంది.

కోనేటి వాగులో..

హుస్నాబాద్‌రూరల్‌: హుస్నాబాద్ మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వానలకు వాగులు పొంగడంతో ఎర్ర నీరుకు చేపలు ఎదురెక్కాయి. శుక్రవారం కోనేటి వాగు బోర్లడంతో ఎల్లమ్మ చెరువుకు వరద నీరు చేరింది. ఈ వాగులోనే చేపలు రావడంతో మత్స్యకారులు చేపలు పడుతున్నారు.



రుతుప్రేమపై అవగాహన

డీపీఓ దేవికీదేవి

మర్కూక్(గజ్వేల్‌): రుతుప్రేమపై అపోహలు మాని, విస్తృతంగా చర్చించాలని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి అన్నారు. శుక్రవారం మర్కూక్ మండలంలోని ఎర్రవల్లిలో ఎంపీడీఓ ప్రవీణ్ అధ్యక్షతన రుతప్రేమపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రత పాటించడం, ఆరోగ్య పరంగా సరైన జాగ్రత్తలు తీసుకుంటే సమస్య ఉండదని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. శాంతి, సర్పంచ్ భాగ్యబిక్షపతి, ఎంపీటీసీ ధనలక్ష్మీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్‌లో..

జగదేవ్‌పూర్(గజ్వేల్‌): రుతుప్రేమపై ప్రతి మహిళ అవగాహన పెంచుకోవాలని దేవకీదేవి అన్నారు. నిర్మల్‌నగర్ గ్రామంలోని ఫంక్షన్ హాల్‌లో మహిళలకు రుతుప్రేమపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ మహిళ ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటే సమస్య ఉండదని వివరించారు. ఈ కార్యక్రమంలో డా.శాంతి, ఎంపీడీఓ శ్రీనివాస్‌వర్మ, సర్పంచ్ శ్యామలరాజు, లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రమ్యరవి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సునీతా, రజిత తదితరులు పాల్గొన్నారు.


మర్కూక్: ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితారెడ్డి

దుబ్బాకటౌన్‌: ఇంటి పరిసరాల్లో వరద నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత అన్నారు. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులో ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఇండ్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట వార్డులో కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డితో కలిసి డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో పర్యటించి వరద నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బందితో ఆయిల్ బాల్స్‌తో పాటు ఆంటీ లార్వా మందును స్ప్రే చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో పరిసరాల్లో వర్షం నీరు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు పెరిగిపోతాయని తద్వార వ్యాధులు ప్రబలుతాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బత్తుల స్వామి, దుబ్బాక బాలకృష్ణాగౌడ్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయపోలులో..

రాయపోలు(దుబ్బాక): కురుస్తున్న వర్షాలకు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అంటువ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని దౌల్తాబాద్ మండలం ఉప్పర్‌పల్లి సర్పంచ్ చిత్తారి గౌడ్ సూచించారు. శుక్రవారం డ్రైడే - ఫ్రైడే సందర్భంగా గ్రామంలో పర్యటించి ప్రజలకు అవగాహనా కల్పించారు. ఆరుబయట నీరు నిల్వ లేకుండా ప్రజలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషోర్, ఫీల్డ్ అసిస్టెంట్ రవికుమార్ తదితరులున్నారు.


దుబ్బాకటౌన్‌: దోమల నివారణ మందును స్ప్రే చేయిస్తున్న గన్నె వనిత, కమిషనర్

చేర్యాలలో...

చేర్యాల(సిద్దిపేట): పట్టణ ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి సూచించారు. ఫ్రైడే, డ్రైడే సందర్భంగా శుక్రవారం పట్టణ పరిధిలోని 1వ, 4వ వార్డుల్లో నీటి నిల్వలను తొలగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దిపేటజోన్‌: చుట్టు పక్కల పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మెన్, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ అన్నారు. నడుస్తూ చెత్త ఎరుదాం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 41, 43వ వార్డులో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఫ్రైడే డ్రై డేలో భాగంగా ఇళ్ల ముందు నిల్వ ఉన్న నీటిని తొలగించారు.

సంక్షిప్త వార్తలు

◆ **రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి**

రాయపోలు(దుబ్బాక): నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని దౌల్తాబాద్ వ్యవసాయ విస్తరణాధికారి అంబటి రాజుగౌడ్ సూచించారు.

◆ **దరఖాస్తు గడువు పెంచాలి**

తొగుట(దుబ్బాక): ప్రభుత్వం మైనార్టీ మహిళలకు స్వయం ఉపాధికి అందిస్తున్న కుట్టు మిషన్ల దరఖాస్తు గడువును పెంచాలని దుబ్బాక నియోజకవర్గ మజిద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మౌలానుద్దీన్ కోరారు. మండల కేంద్రంలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ ప్రభుత్వం మైనార్టీ సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి దరఖాస్తు గడువును పెంచాలని ఆయన కోరారు.

◆ **కాన్గల్‌లో పంటల పరిశీలన**

తొగుట(దుబ్బాక): కాన్గల్ గ్రామంలో సాగుచేసిన పత్తి పంటలను ఏవో మోహన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలుసూచనలు చేశారు. మూడు రోజులుగా వర్షం కురుస్తున్నందునా మొక్కజొన్న, పత్తి పంటల్లో నీరు నిల్వ ఉండకుండా కాలువలు తీయాలని సూచించారు. పత్తి మొక్కల వేరు వద్ద వర్షపునీరు చేరి వేరు నల్లగా మారితే 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును వేరు మొదట్లో స్ప్రే చేయాలన్నారు. మొక్కకు అధిక బలంచేకూరేందుకు 25కిలోల యూరియా 15కిలోల పొటాష్ వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఈవో రాజేష్, రైతుబంధు అధ్యక్షుడు కాముని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చిన్నకోడూరులో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఏఓ జయంత్‌తో పాటు ఏఈఓలు క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ జయంత్ మాట్లాడుతూ లేత దశలో ఉన్న పత్తి నిల్వ నీటిని తట్టుకోలేదన్నారు. గండ్లు పెట్టి నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. వరి నారు మడుల్లో నీటి నిల్వ ఎక్కువగా ఉండకుండా చూసుకోవాలన్నారు.

ములుగులో..

ములుగు(గజ్వేల్‌): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉంటూ పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని ములుగు మండల వ్యవసాయ అధికారిణి ప్రగతి సూచించారు. లక్ష్మక్కపల్లి, కొక్కొండ, బస్వాపూర్, క్షీరసాగర్ గ్రామాలను సందర్శించిన ఆమె వరి, పత్తి, మొక్కజొన్న, కంది తదితర పంటలను పరిశీలించారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారులు పృథ్వీ, రమ, ధీనలు పాల్గొన్నారు.

◆ **శ్రీరాములును సస్పెండ్ చేయాలి**

మద్దూరు(హుస్నాబాద్‌): జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని విమర్శిస్తూ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న మాజీ ఆప్కో చైర్మన్ శ్రీరాములును సస్పెండ్ చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు మంద యాదగిరి ప్రకటించారు. శుక్రవారం దూళ్మిట్ట మండల కేంద్రంలో ఆయన ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్‌లతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2009లో కిష్ట పరిస్థితిలో ఉన్న పార్టీని కాపాడుకున్న వ్యక్తి ముత్తిరెడ్డి అని వారు కొనియాడారు. ఇంకోసారి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై విమర్శలు చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం, బీఆర్‌ఎస్ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ నాగ్గిళ్ల తిరుపతి రెడ్డి, దుబ్బుడు వేణుగోపాల్‌రెడ్డి, సుందరగిరి పర్శ రాములుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

◆ **పరామర్శ**

జగదేవ్‌పూర్(గజ్వేల్‌): మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన మంచోజు ఉపేంద్రచారి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ భానుప్రకాష్‌రావు, మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, ఎంపీటీసీ మంజుల మహేందర్‌రెడ్డిలు వేర్వేరుగా పరామర్శించారు. అనంతరం వారు ఒక్కొక్కరూ రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట నర్సింహారెడ్డి, రాజు, మహేందర్‌రెడ్డి, కిష్టయ్యలు ఉన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్‌): తిగుల్ గ్రామానికి చెందిన కోన్యాల తిరుపతిరెడ్డి లైబ్రేరియన్, ఉపాధ్యాయుడు బాల్‌రెడ్డి తల్లి అంజమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం దశదినకర్మ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట రైతుబంధు మండల కో ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, ఉపసర్పంచ్ ఐలయ్య, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు ఎల్లారెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): పట్టణపరిధిలోని 11వవార్డుకు చెందిన శ్రీరాం రాజవ్వ ఇల్లు కూలిపోయింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి శుక్రవారం బాధిత కు టుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు.

మిరుదొడ్డిలో..

మిరుదొడ్డి(దుబ్బాక): రుద్రారం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నాగరాజు, మహేశ్ కుటుంబాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మామిడి మోహన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట ఏఎంసీ డైరెక్టర్ అభిలాష్, ఆత్మకమిటీ డైరెక్టర్ మురళి, ఆంజనేయులు, హర్షిత్, తదితరులు ఉన్నారు.

◆ **విజ్ఞానయాత్రకు పాల ఉత్పత్తిదారులు**

హుస్నాబాద్‌రూరల్‌: పాల ఉత్పత్తిలో విజ్ఞానం పొందుటకు కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో శుక్రవారం విజ్ఞాన యాత్రకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మేనేజరు నాగయ్య మాట్లాడుతూ పాల దిగుబడులను పెంచుటకు విజ్ఞాన యాత్ర దోహదపడుతుందన్నారు. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు ప్రాంతాల్లో ఐదు రోజుల పాటు పాల ఉత్పత్తిదారులను తీసుకెళ్లి అక్కడి రైతులు తీసే పాల దిగుబడుల గురించి అవగాహన కల్పించనున్నారు. సూపర్ వైజర్ వీరస్వామి, రైతులు పాల్గొన్నారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత**

చేర్యాల(సిద్దిపేట): చిట్యాల గ్రామానికి చెందిన ఆకుల నారాయణ, మేక అశోక్‌లకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60వేలు, రూ.40వేల చెక్కులను శుక్రవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సులోచన, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బొడిగం మహిపాల్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీరాములు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాటికొండ సదానందం, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు పెంబర్ల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా ఖర్గే జన్మదిన వేడుకలు**

మద్దూరు(హుస్నాబాద్‌): ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలను మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెట్కూరి కమాలకర్‌యాదవ్ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. వెంకటేష్, మనోజ్, నరేష్, శ్రీను, రమేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **నాణ్యమైన విద్య అందించాలి**

బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి సైకిల్ యాత్ర బెజ్జంకి చేరుకుంది. జిల్లా అధ్యక్షుడు అరవింద్, శ్రీనివాస్, సాయిక్రిష్ణ పాల్గొన్నారు.

◆ **బ్రిడ్జి మంజూరు చేయాలని వినతి**

బెజ్జంకి(సిద్దిపేట): వరికోలు రోడ్డుకు బ్రిడ్జి మంజూరు చేయాలని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు సిద్దిపేటలోని ఆయన నివాసంలో శుక్రవారం సర్పంచ్ బోయినపల్లి నర్సింగరావు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై మంత్రి సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశించినట్లు సర్పంచ్ తెలిపారు.

◆ **కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం**

దుబ్బాక: రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, భారత జోడో యాత్ర సహచరుడు సంతోష్ కొల్కొండ అన్నారు. శుక్రవారం దుబ్బాక పట్టణంలో కాంగ్రెస్ కార్యాలయంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కత్తి కార్తీక గౌడ్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్త దేవిరెడ్డి, శ్రీనివాస్ రావు, సాయి, తదితరులున్నారు.

◆ **ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా?**

దుబ్బాక: దుబ్బాకలో విద్యుత్ అధికారులు సమస్యల పట్ల నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. పట్టణంలో బస్టాండ్‌కు ఎదురుగా వీధిలో కరెంట్ స్తంభం బిల్డింగ్‌కు ఒరిగి ప్రమాదకరంగా మారింది. ప్రమాదం జరుగక ముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

◆ **డ్రైవింగ్ లైసెన్సులు అందజేత**

సిద్దిపేటఅర్బన్‌: బొగ్గులోనిబండ గ్రామానికి చెందిన 33 మంది యువతకు మంత్రి హరీశ్‌రావు చొరవతో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేసినట్లు బీఆర్ఎస్వీ గ్రామ శాఖ అధ్యక్షుడు అందె అంకుశం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్ రైతు వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి, ఆర్‌టీఏ మెంబర్ ఇర్షాద్, పాల్గొన్నారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

సిద్దిపేటకమాన్‌: సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంఆర్‌యు యూనిట్‌లో రీసెర్చ్ సైంటిస్ట్, ల్యాబ్ టెక్నిషియన్, డెటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విమలాథామస్ ఒక ప్రకటనలో తెలిపారు.

◆ **పారదర్శకంగా ఓటరు నమోదు**

బెజ్జంకి సిద్దిపేట: ఓటరు నమోదు పారదర్శకంగా నిర్వహించాలని బెజ్జంకి తహసీల్దార్ విజయప్రకాశ్ రావు సూచించారు. బెజ్జంకి రైతువేదికలో శుక్రవారం బీఎల్ఓలు, సూపర్‌వైజర్‌లకు ఓటరు నమోదు చేయడానికి శిక్షణ నిర్వహించారు. మానకొండూర్ నియోజకవర్గ రీసోర్స్ పర్సన్ కేస్ అనంతచార్య, మనోహర్‌రెడ్డిలు బీఎల్ఓలకు శిక్షణ ఇచ్చారు. డీటీ పార్థసారధి, ఆర్ఐ రాజయ్య, పాల్గొన్నారు.